


# బాపు - రమణ

## నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల



అనగా అనగా గోదావరి జిల్లాల్లో ఒక బాపు. ఒక రమణ. రమణది తూర్పు. బాపుది పడమర. ఈ తూర్పూ పడమరలని కలిపి, ఇన్నాళ్ళూ ఇన్నేళ్ళూ మనకి



హాయిగా హుషారుగా, అన్నిటికీ మించి స్వచ్ఛంగా నవ్వుకునే అదృష్టం మొట్టమొదటిసారిగా కలిగించింది ఆలిండియా రేడియోలో బాలానందం కార్యక్రమం నిర్వహించిన రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావుగారు, రేడియో అక్కయ్య కామేశ్వరిగారు. వారు నడిపిన బాల పత్రికలో, 1946లో బాపు వేసిన బొమ్మ, రమణ వ్రాసిన కథ ప్రచురింపబడి, బాపూరమణల శకానికి ప్రారంభోత్సవం జరిగింది.

అప్పటినించీ ఇప్పటిదాకా అంటే షష్టిపూర్తి జరుపుకుని, అంటే అరవై సంవత్సరాలసేపు, తెలుగు భారతి బాపూ బొమ్మలా అందంగా, రమణ హాస్యంతో గలగలా పారుతున్న గోదారిలా చరిత్రని నడిపింది. నడిపిస్తున్నది. కలకాలం నడిపిస్తుంది.



రమణ ఒక కథ వ్రాసి, దానికి బాపు చేత బొమ్మవేయించి, సంపాదకులు విద్వాన్ విశ్వం దగ్గరికి తీసుకు వెళ్ళారుట. ఆయన రమణని ఎగాదిగా చూసి, 'ఇంతున్నావ్, నువ్వేం రాస్తావ్' అన్నారుట. అప్పుడు రమణ 'నా కథ వేస్తే ఈ బొమ్మ ఫ్రీ' అన్నారుట, బాపు బొమ్మ చూపించి. ఆయనా బొమ్మ చూసి, 'ఇడ్లీకన్నా

పచ్చడే బాగుంది' అని అవి రెండూ కలిపి ప్రచురించారుట.

సత్తిరాజు లక్ష్మీనారాయణగారి అసలు పేరు బాపు. ముళ్ళపూడి వెంకట్రావ్‌గారి పూర్తి పేరు రమణ. ముళ్ళపూడి వెంకటరమణ. బాపుకి 1933 ఏళ్ళు. రమణకి 1931 ఏళ్ళు. అంటే బాపు కన్నా రమణ రెండేళ్ళు పెద్ద.

రమణ సృష్టి చేసిన పాత్రలు గురజాడ గిరీశంలా, మొక్కపాటి పార్వతీశంలా, మునిమాణిక్యం కాంతంలా, నండూరి ఎంకిలా మన పక్కనే రోజూ తారసపడుతుంటాయి. అప్పుల అప్పారావు, బుడుగు, వాళ్ళ బాబాయి, సీ.గానొపెసూనాంబా, రాధాగోపాలం, రెండు జెళ్ళ సీత, పక్కింటి లావుపాటి పిన్నిగారు, దాని ముగుడూ, తీసేసిన తాసిల్దారు... ఇలా ఎంతోమంది. ఆ పాత్రలు అంత సజీవంగా వుండటానికి కారణం, ఒక్క ఇడ్లీ మాత్రమే కాదు, పచ్చడి కూడాను. రెండు జెడల అమ్మాయిని చూసి, సీతలా వుంది అని కొందరు అనుకుంటే, అచ్చం బాపు బొమ్మలా వుంది అని చాలమంది అనుకుంటారు.

బాపు-రమణలు మన జీవితంలో రోజూ కనపడే పాత్రలతో గొప్ప హాస్యం సృష్టించి మనల్ని పాడుచేశారు. ఆంధ్రాలోనే కాదు, అమెరికాలో వున్నా కూడా ఎప్పుడో ఎక్కడో, ఎవరితోనో మాట్లాడుతున్నప్పుడు, హఠాత్తుగా ఆ సంఘటనలకు సంబంధించిన వాళ్ళ జోకు ఏదో గుర్తుకి వచ్చి నాలో నేనే నవ్వుకుంటుంటాను. అది చూసి నన్నో పిచ్చి శంకరయ్య అనుకునే అవకాశం కూడా వుంది.

ఉదాహరణకి, విమానం ఎక్కినప్పుడల్లా నాకు పైలట్, విమానం తోలేవాడిలా కనిపిస్తాడు కానీ పైలట్‌లా కాదు. ఎవరైనా చిన్న పిల్లాడు రోడ్డు మీద ఏదన్నా వెతుకుతుంటే, 'ఏంతమ్మా ఎతుకుతున్నావూ' అని అడిగే పెద్ద మనిషీ, 'ఎద్దులా వున్నావు. సరిగ్గా మాట్లాడలేవూ' అనే కుర్రాడూ గుర్తొస్తారు నాకు. అలాగే రోడ్డు మీద అందమైన అమ్మాయిల్ని తల తిప్పి చూస్తూ నడుస్తున్న వాళ్ళు కనిపిస్తే 'జరగరా జరుగు. ఇంకోడొ స్తున్నాడు' కార్టూన్ గుర్తొస్తుంది. అలాగే ఏదన్నా అవకతవక సినిమా చూడగానే 'భశుం' అనటం అలవాటయిపోయింది.

రమణ మనలాటివారిని నవ్వించటానికి కథలు, నవలలు, సినిమాలకి మాటలూ వ్రాయటమే కాక, పిల్లల కోసం కథలు స్త్రీల కోసం వ్యాసాలూ, వ్యాకరణం (వ్యాకరణం స్త్రీలకి మాత్రమే కాదు, మగవాళ్ళకి కూడాను), సంగీతం మీదా సినిమాల మీదా వ్యాసాలూ, సమీక్షలూ, తెలుగు భాషపై వ్యాసాలూ, పాతాల విడియోలూ, ఇంగ్లీషు నవలలకి తెలుగు అనువాదాలూ, జీవిత చరిత్రలూ ఇలా చాలా వ్రాశారు. వాటిల్లో కూడా ఆయన హాస్య బాణీ కనపడటం విశేషం.

విమానాల కన్నా, బెలూన్లలో వెళ్ళటం ప్రమాదకరమని చెబుతూ ఇలా అంటారు. 'శత్రుసైన్యం ఏం చేస్తున్నదో చూద్దామని బెలూన్‌లో వెళ్ళారనుకో. సరిగ్గా శత్రు సైన్యం నెత్తి మీద బెలూన్ పేలిపోయిందనుకో. అప్పుడు గోవిందా అని ఇంగ్లీషు భాషలో అరుస్తూ, మనవాడు వాడి ఒళ్ళో పడిపోతాడు. వాళ్ళు వీడిని గోవింద కొట్టించేస్తారు'

'తెలుగు అన్ని భాషల్లా కాదు. ఎలా రాస్తామో, అచ్చం అలాగే పలుకుతాం' అని గర్వపడేవాళ్ళ గురించి, ఇలా అంటారు. మనం సూర్యనారాయణ అని రాస్తాం. కానీ పిలిచేటప్పుడు, 'ఒరే! సూన్నాణా!' అని పిలుస్తాం.

ఆయన వ్రాసిన సినిమా రివ్యూలలో మచ్చుకి కొన్ని మాటలు: (కొన్ని అంటే రెండే రెండు అని అర్థం)

'ఈ సినిమాలో ఊగ్ అండ్ ధొర్ల్ డాన్సులున్నాయి'

'ఈ చిత్రం పొడుగునా చక్కని కామాలూ, సెమికోలన్లూ పెడుతూ, తరువాతి ఘట్టం మీదకు మనని సుఖంగా జరుపుతూ వున్నా, అక్కడక్కడా

ప్రశ్నార్థకాల, ఆశ్చర్యార్థకాల గతుకులూ, కొండొకచో డైలాగుల అతుకులు కనబడతాయి'

రమణ రచనల్లో నాకు చాల ఆశ్చర్యం కలిగించేది ఒకటుంది - సరదాగా వ్రాస్తూనే హఠాత్తుగా రాజకీయ, సాంఘిక, మానవతా వాదంతో చెంప ఫెళ్ళుమనేలా కొట్టి, మరిచిపోకుండా చేసే రచనా చాతుర్యం.

మళ్ళీ మచ్చుకి కొన్ని: (కొన్ని అంటే అరడజను అని అర్థం)

'నవ్వొచ్చినప్పుడు ఎవడయినా నవ్వుతాడు. ఏడుపొచ్చినప్పుడు నవ్వే వాడే హీరో'

'సిఫార్సులతో సంసారాలు చక్కబడవు'

'సత్యాన్వేషికి సమాధానం ఏమిటని గణిత శాస్త్రజ్ఞుడిని అడిగితే, స్క్వేర్ రూట్ ఆఫ్ మైనస్ వన్ అంటాడు'

'పగటికల అనేది మనిషికి దేవుడిచ్చిన వరం. మనసులో పేరుకుపోయిన దురాశలనీ, నిరాశలనీ అందీ అందని ఆశలుగా పరిమార్చివేసే మందు. మితంగా సేవిస్తే, కండకూ గుండెకూ పుష్టి నిచ్చే దివ్యౌషధం'

'టైము అనగా కాలము. చాల విలువైనది. బజార్లో మనం మిరపకాయలు కొనగలం. చింతపండు కొనగలం. ఇడ్లీలు, కిడ్నీలు కొనగలం. గొడుగులు, గోంగూర కొనగలం. బాల్చీలు, లాల్చీలు కొనగలం. కానీ కాలాన్ని మాత్రం కొనలేం. కాలన్ని వృధా చేయటం క్షమించరాని నేరం'

'వారానికి అర్థ రూపాయి ఇస్తే, రోజూ హోటల్ భోజనపు ఎంగిలాకులన్నీ నువ్వొచ్చే వరకూ వుంచి, రాగానే నీకు పడేస్తా!'

ఇలాటవి చదువుతుంటే, ఆకలేస్తే కేకలే వేయఖ్ఖర్లేదు, జోకులు వేసి కూడా చెప్పేదేదో తల తిరిగేలా
చెప్పొచ్చు అనిపిస్తుంది.

రమణ ఒక ఝంగుమనే మందపాటి సత్యాన్ని, గేయ రూపంలో కూడా వ్రాశారు.

దేవుడనే వాడి కొరకు దేవులాడబోకు
మార్కెట్లో లేడంటే వున్నాడనబోకు
ఓంకారం నోంకారం కావు మనకి ముఖ్యం
గింకారం రూపాయంగీకారమే నిత్యం!

దటీజ్ రమణ! ముళ్ళపూడి వెంకటరమణ!

'మనసుకి కనిపించే మనోహర సౌందర్యాన్ని వర్ణించబోతే చిక్కి సగమైపోతుంది. అలా సగమైపోకుండా, వాటి అందాన్ని రెట్టింపు చేసే శిల్పం పేరే బాపు. బాపు బొమ్మలు రచనలకి రేఖానువాదాలు కావు. అపురూప సుందర వ్యాఖ్యానాలు. ఒక నవ్వు, ఒక సిగ్గు, ఒక అలక... బొమ్మలు మాట్లాడతాయి. నటిస్తాయి. వెక్కిరిస్తాయి. పలకరిస్తాయి. రెచ్చకొడతాయి... హాయినిస్తాయి'

బాపు గురించి చెప్పిన ఈ మాటలు నావి కావు. బాపు గురించి రమణ వ్రాసినవి. అదే బాపు.

అందమైన అమ్మాయికి ప్రతీక బాపు బొమ్మ.

మమూలుగా ముందు కథ చదివి, చూడాలని వుంటే బొమ్మని చూస్తాం. అదే బాపు వేస్తే ముందు బొమ్మనే చూస్తాం. తర్వాత ఆ బొమ్మ కథని చదివిస్తుంది. కథలో పాత్రలకీ, సంఘటనలకి ప్రాణం పోస్తాయి బాపు చిత్రాలు.

ఆరేళ్ళ క్రితం మద్రాసులో బాపూగారిని కలిసినప్పుడు, నా రెండు పుస్తకాల స్క్రిప్టులూ ఒక్క రాత్రిలో చదివేసి, పొద్దున్నే గుంటూరుకి ఫోన్ చేసి, అట్టమీద బొమ్మలు రెడీ అని చెప్పారాయన. నేను రెండు వందల పేజీలు వ్రాస్తే, బొమ్మలు ఎంతో అట్టహాసంగా వేసేసి, ఒక్క అట్ట మీదే కథంతా చెప్పేశారాయన.

కొంటె బొమ్మల బాపు

కొన్ని తరముల సేపు
గుండె నూయల లూపు ... ఓ కూనలమ్మా!

ఇవాళ బాపు అభిమానులు మూడో తరం. ఇంకెన్ని తరాలుంటాయో చెప్పటం ఎవరి తరం అంటారు ఆరుద్ర.

బాపు మంచి కార్టూనిస్టు. గొప్ప చిత్రకారులు. మంచి సినిమా దర్శకులు. ఆయన్ని చూడకపోతే, అమ్మో బాపు ఎంతవాడు అనిపిస్తుంది. ఎంతో సామాన్యమైన మనిషిలా కనపడే ఆయన్ని చూసిన వెంటనే, ఈయనేనా బాపు అనిపిస్తుంది. ఆయనతో కాసేపు మాట్లాడితే చాలు, ఈయనే బాపు అని అర్థమైపోతుంది. అంతేకాదు అప్పటిదాకా తమకి కొమ్ములున్నాయనుకునే వాళ్ళు సిగ్గుపడి, కొమ్ములు మనుష్యులకి వుండవు, కొన్ని జంతువులకే అని తెలుసు కుంటారు.

ఒక దశాబ్దం క్రింద హ్యూస్టన్‌లో నా అమెరికా బేతాళుడి కథల పుస్తకం ఆయనకి ఇస్తే, నమస్కారం పెట్టి పుస్తకాన్ని కళ్ళకద్దుకుని, చదివి తన అభిప్రాయం వ్రాస్తానన్నారు. బిజీగా వుండే పెద్దమనిషి కదా, ఏదో సరదాగా అన్నారులే ఆ మాట అనుకున్నాను. నెల రోజులు తిరక్కుండానే, రెండు పేజీల ఉత్తరంలో, - ఆయనకి నచ్చిన విషయాలూ, సంఘటనలూ వ్రాస్తూ పుస్తకాన్ని రివ్యూ చేసి, ఆశ్చర్యపరిచిన గొప్ప పాఠకులు బాపు. అదే నాకు ఎంతో స్ఫూర్తినిచ్చి, రచనలు చేయటంలో ఉత్సాహాన్ని ఎక్కువ చేసింది.

బాపుగారి కార్టూనులు ఆరుద్రగారు అన్నట్టుగా గుండె నూయలలూపుతూనే వుంటాయి.

వాటిల్లో నన్ను ఎప్పుడూ చక్కిలిగింతలు పెట్టేవి చాలా వున్నాయి.

'మహత్తర యవ్వన గుళికలు బాబూ. ఒక్క బుడ్డి సేవిస్తే పదేళ్ళు వెనక్కి వెడతాయి' అంటే ముసలాయన ఆశగా ముఖంపెట్టి, 'మరి నా పింఛనుకేమీ ఇబ్బంది రాదు కదా!' అంటాడు.

'ఏరోయ్! చాల్రోజులయింది. ఎలా వున్నావ్. పెళ్ళీ గిళ్ళీ అయిందా లేక వంటా అదీ నువ్వేనా' అంటాడు
మిత్రుడు. దానికి అతను అంటాడు 'పెళ్ళీ గిళ్ళీ అయింది. వంటా అదీ కూడా నేనే' అని.

'ఈ నిరోధ్ పాకెట్లు మిగిలిపోయాయి... ఇవి తీసుకుని, ఒక గ్లాస్కో పాల డబ్బా ఇస్తారా?'

'పిన్నిగారూ... ఒక బుడ్డి కిరసనయిలు వుంటే ఇస్తారా! మా కోడలు చెప్పిన మాట వినటం లేదు' అన్న కార్టూను మన హృదయాలని కదిలిస్తుంది.

ఇలాటివి ఎన్నో, ఎన్నెన్నో. కొన్ని తరముల సేపు చెప్పుకునేనన్ని.

బాపూగారితో మాట్లాడుతున్నప్పుడు, ఆయనలో హాస్యం అలా అలా ప్రవహిస్తూనే వుంటుంది. ఆయన ఉత్తరాలూ అంతే. భద్రంగా దాచుకున్నాను.

నేనెక్కడో చదివిన జోకు నాకు బాగా నచ్చింది కాబట్టి, మీకు చెప్పాలనిపించి నిజమైనా కాకపోయినా చెప్పేస్తున్నాను. బుద్ధిమంతుడు సినిమా తీస్తున్నప్పుడు, ఒక గాసిప్ పత్రిక 'ఈ సినిమా తీస్తున్నప్పుడు బాపూకీ నాగేశ్వరావ్‌కీ మాటామాటా వచ్చి జుట్టు జుట్టూ పట్టుకుని కొట్టుకున్నారు' అని గాసిప్ రాసిందిట. అప్పుడు బాపు అన్నారుట 'నాగేశ్వరావ్ జుట్టూ, నా జుట్టూ చూసినవాళ్ళకి తెలుసు ఆ మాటల్లో ఎంత నిజముందో' అని.

తల్లి పదేళ్ళ భావి పౌరుడ్ని మందలించబోయింది. 'అబద్ధాలు చెబితే ఏమవుతుందో తెలుసా?'

'తెలుసు. రైల్లో అర టిక్కెట్టు మీద వెళ్ళొచ్చు'

బుడుగు వాళ్ళమ్మతో అంటాడు 'ఎందుకు కసురుతావ్! నీ ముగుడ్ననుకున్నావా?' అని.

'దిస్ స్టోరీ ఈజ్ బ్రిలియంట్. టూ బ్రిలియంట్ టు బి ఎ తెలుగూ స్టోరీ... సో ఇట్ మస్ట్ బి ఎ కాపీ'

బాపు రమణలు 'నవ్వితే నవ్వండి. మాకభ్యంతరం లేదు' అన్నారు.

మీరిలాటి జోకులు వేస్తుంటే మీకు అభ్యంతరం వున్నా లేక పోయినా మేము చేసేదేమీ లేదు సార్, పగలబడి నవ్వటం తప్ప!

అంతేకాదు ఇలా వ్రాసుకుంటూ పోతే బాపూ రమణల కాంబినేషన్ షష్టిపూర్తి మనల్నిలా కొన్ని కాదు, ఎన్నో పేజీలసేపు నవ్విస్తూనే వుంటుంది. ఇంకా చాల వ్రాయాలనే వుంది కానీ, మరీ పొగుడుతూ వ్రాస్తే, ముత్యాలముగ్గు సినిమాలో భజంత్రీలు డప్పు వాయించేస్తారేమోనని, ఇక్కడితో ఆపేయవలసి వస్తున్నది.

బాపు-రమణలు మన తెలుగు వాళ్ళయినందుకు మనమందరం గర్వపడుతూ, హాస్యానికి అడ్రస్ మనదే అని చెప్పుకుందాం.

రమణ అన్నారు, కాపీ రైట్ అంటే కాపీ చేయటం రైట్ అనీ, రాంగ్ కాదనీ. ఈ వ్యాసంలో నేను రాంగ్ అవటం ఇష్టం లేక, ఎన్నో పుస్తకాలు తిరగేయాల్సి వచ్చింది. నా కాపీని రైట్ చేసిన వాళ్ళందరికీ నా ధన్యవాదాలు.

(2006, అక్టోబర్ 14, 15 తేదీలలో హ్యూస్టన్, టెక్సస్‌లో వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో జరిగిన ఐదవ అమెరికా తెలుగు సాహితీ సదస్సు మరియూ 17వ టెక్సస్ తెలుగు సాహిత్య సదస్సులో, బాపుగారికి ఇచ్చిన లైఫ్ టైం ఎఛీవ్‌మెంట్ బహుమతి ప్రదాన సమయంలో చదివిన నా పరిచయ వ్యాసం)